
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట

5

సోమవారం 27 అక్టోబరు 2025





కోహెడలో సంస్మరణ సభలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న అమరుల కుటుంబసభ్యులు, కవులు, రచయితలు

స్థానిక సాహిత్యానికి

పట్టాభిషేకం

- సిద్దిపేట డిగ్రీ కళాశాల తెలుగు పాఠ్య ప్రణాళికలో విప్లవాత్మక మార్పులు
- అటానమస్ నిబంధనల మేరకు స్థానిక పాఠ్యాంశాలు
- డా.నందిని సిధారెడ్డి, సిద్దెంకి యాదగిరి, ఐతా చంద్రయ్య రచనలు ఎంపిక
- కొత్తకొండ చరిత్ర, ఓరుగల్లు సందర్శన పాఠాలు

7

గ్రామీణ రోడ్లకు

మోక్షమెన్నడో?

- ఇటీవల వర్షాలకు కొమురవెల్లి మండలంలో అధ్వానంగా మారిన రోడ్లు
- అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- నేటికీ కొన్ని గ్రామాలకు మట్టిరోడ్డే దిక్కు

8

భార్య కాపురానికి రావడంలేదని.. వేర్వేరు చోట్ల

ఇద్దరి ఆత్మహత్య

6

కిక్కు ప్రాప్తిరస్తు!

- నేడు మద్యం దుకాణాల లక్కీ డ్రా
- ఉత్కంఠతో ఎదురుచూస్తున్న ఆశావహులు

- జిల్లాలోని 93 దుకాణాలకు 2,782 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ. 83.46 కోట్ల ఆదాయం
- పలు దుకాణాలకు 50కి పైగా దరఖాస్తులు
- సిద్దిపేటలోని సీసీ గార్డెన్‌లో ఏర్పాట్లు పూర్తి



సిద్దిపేటలోని సీసీ గార్డెన్‌లో మద్యం దుకాణాల లక్కీ డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులు

సిద్దిపేట అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో నేడు సిద్దిపేట జిల్లాలో 2025-2027 సంవత్సరానికి గానూ 93 మద్యం దుకాణాలకు డ్రా తీయనున్నారు. గత నెల సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 18 వరకు జిల్లాలోని 94 దుకాణాలకు దరఖాస్తులను స్వీకరించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23 వరకు తేదీని పొడిగించింది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా సిద్దిపేట జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు మొత్తం 2,782 దరఖాస్తులు వచ్చాయి. షెడ్యూల్ ప్రకారం నేడు ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ హైమావతి సమక్షంలో మద్యం దుకాణాలకు సంబంధించి డ్రా తీయనున్నారు. ఈ డ్రా ప్రక్రియను సిద్దిపేటలోని సీసీ గార్డెన్‌లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అందరి చూపు ఆ షాపులపైనే!

జిల్లాలోని పలు దుకాణాలకు 50కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్‌లోని దుకాణం నం.1కు అత్యధికంగా 73, తీగుల్ నర్సాపూర్‌లోని దుకాణం నం.2కు 60, మర్కూక్‌కు 61, వంటిమామిడికి 52, సిద్దిపేటలోని దుకాణం నం. 5కు 52 దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు కొండపోచమ్మ వద్ద ఉన్న మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయోనని ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆలయం వద్ద బెల్టుషాపులు అధిక సంఖ్యలో ఉండటం, భక్తుల రద్దీ సమయంలో మద్యం దుకాణాల కౌంటర్ ద్వారా రోజుకు రూ.10 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుండటంతో ఆ దుకాణాలకు అధిక సంఖ్యలో దరఖాస్తు చేశారు.

రూ. 83.46 కోట్ల ఆదాయం

దరఖాస్తు ఫీజుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. గత ప్రభుత్వంలో దరఖాస్తు ఫీజును రూ. 2లక్షలకు నిర్ణయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఫీజును మరో లక్ష పెంచి రూ.3 లక్షలకు నిర్ణయించింది. దీంతో మొదట్లో దరఖాస్తు చేసుకునేందుకు ఆశావహులు ఆసక్తి చూపలేదు. ఆ తర్వాత వ్యాపారస్తులు ముందడుగు వేయడంతో దరఖాస్తులు పెరిగాయి. మొదటగా నిర్ణయించిన గడువు తేదీ ఈ నెల 18 వరకు మొత్తంగా 2,585 దరఖాస్తులకు గానూ రూ. 77.55 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అయ్యింది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం మరో ఐదు రోజులకు గడువు పెంచింది. తుది గడువు ఈ నెల 23 వరకు పూర్తికావడంతో మొత్తంగా 2,782 దరఖాస్తులకు గానూ రూ. 83.46 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి.

అమ్ముకోవడానికి సిద్ధంగా

రూ. 3లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు లక్కుండి దుకాణం దక్కితే, ఆ షాపును అమ్ముకునేందుకు కూడా పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

మిగతా 8వ పేజీలో

బూటకపు ఎన్‌కౌంటర్లతో

ఉద్యమాన్ని ఆపలేరు

- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుల సంస్మరణ సభలో వక్తలు

కోహెడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల హక్కుల కోసం 40 ఏళ్లుగా పోరాడుతున్న మావోయిస్టు అగ్రనేతలను కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తుందని ఆదివాసి హక్కుల సభ్యురాలు సోనీ సోరీ, ఆదివాసి హక్కుల కార్యకర్త గాదె ఇన్నయ్య, విప్లవ రచయితల సంఘం నాయకుడు పాణి ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మాడ్‌లో సెప్టెంబరు 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ఖాతా రాంచంద్రారెడ్డి (రాజు దాదా అలియాస్ గుసెండి అలియాస్ విజయ్ అలియాస్ వికల్ప్), సత్యనారాయణరెడ్డి (కోసా దాదా) సంస్మరణ సభను సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఎన్‌కౌంటర్‌లో అమరులైన ఖాతా రాంచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి చిత్రపటాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోనీ సోరీ, గాదె ఇన్నయ్య, పాణిలు మాట్లాడుతూ మావోయిస్టు అగ్రనేతలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత మారుస్తున్నారన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టులను ఏరివేస్తామని ప్రకటించి ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవ యోధులను అంతం చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదని పేర్కొన్నారు. అంతిమ యుద్ధం పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసి అడవి భూములు, అడవి సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసే కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాని మోడీ ప్రకటించిన యుద్ధం మావోయిస్టుల కోసం, ఆదివాసీల కోసం మాత్రమే ప్రకటించలేదని, భారత రాజ్యాంగాన్ని సమూలంగా నాశనం చేయడం కోసమే యుద్ధాన్ని ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 140 కోట్ల మంది భారతదేశ ప్రజలకు భారత రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, ఆదివాసీలను, రాజ్యాంగంలోని నాలుగు, ఐదు షెడ్యూల్‌లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల లొంగిపోయిన వారు ఉద్యమానికి ద్రోహం చేశారన్నారు. 40 ఏళ్ల వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటే ఇప్పుడు లొంగిపోయి అన్యాయం చేస్తారా అంటూ ప్రశ్నించారు.

మిగతా 8వ పేజీలో





రైతు జక్కుల తిరుపతి, ఏఈవో నాగార్జునకు రైతునేస్తం అవార్డును అందజేస్తున్న మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రైతు సేవకు పట్టం

- 'రైతు నేస్తం' అవార్డులందుకున్న రైతు జక్కుల తిరుపతి, ఏఈవో నాగార్జున

తొగుట /చేర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో విశేష సేవలందించిన రైతులకు, అధికారులకు శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రైతునేస్తం పురస్కారాలను ప్రదానం చేశారు. రైతునేస్తం 21 వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయ రంగానికి జీవితాంతం సేవలందించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట రైతునేస్తం పురస్కారాలను యేటా అందిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నుంచి ఈ పురస్కారాలను అందుకున్నారు.

ఏఈవో నాగార్జునకు..

తొగుట మండలం ఎల్లారెడ్డిపేట క్లస్టర్‌లో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న నాగార్జున రైతు నేస్తం అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి వ్యవసాయ విస్తరణ అధికారుల విభాగంలఎనిమిదేళ్లుగా వ్యవసాయ విస్తరణ అధికారిగా, ప్రస్తుతం ఎల్లారెడ్డిపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న నాగార్జున చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.


రైతు జక్కుల తిరుపతికి..

సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన రైతు, చేర్యాల డివిజన్ ఆత్మకమిటీ ఛైర్మన్ జక్కుల తిరుపతి రైతు నేస్తం అవార్డు అందుకున్నారు. సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు పోషక విలువలున్న ధాన్యం పండించడం పట్ల తిరుపతిని అభినందించారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా (డీసీసీ) అధిష్ఠానం ఎవరిని నియమిస్తుందోనని పార్టీ శ్రేణులు, ఆశావాహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు డీసీసీ పదవి కావాలని అంతగా అడగని నాయకులు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ డీసీసీ పదవికి భలే డిమాండ్ పెరిగింది. జిల్లాలో పదుల సంఖ్యలో కాదు ఏకంగా వందల సంఖ్యలో డీసీసీ పదవి కోసం తీవ్ర స్థాయిలో పోటీ పడుతున్నారు. ఈ నెల 14 నుంచి 17 వరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో విడతల వారీగా ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌతేలా ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించి, ఆరుగురి పేర్లతో తుది జాబితా ను ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ మేరకు రానున్న రెండు, మూడు రోజుల్లో సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షుడు ఎవరనేది ఏఐసీసీ ప్రకటించనున్నది.

- సిద్దిపేట అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ఢీసీసీ



- జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి డిమాండ్
- 14 నుంచి 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 170కి పైగా దరఖాస్తులు..
- 40 మందికి ఇంటర్వ్యూ.. ఆరుగురు పేర్లు ఏఐసీసీకి..
- మరో రెండు, మూడు రోజుల్లో కొత్త డీసీసీ ప్రకటన

డీసీసీ పదవికి డిమాండ్ రావడంతో కిందిస్థాయి కార్యకర్త నుంచి పేరున్న నాయకుడి వరకు సిద్దిపేట జిల్లా డీసీసీ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 14 నుంచి 17 వరకు ఏఐసీసీ అబ్జర్వర్ జ్యోతి రౌతేలా ఆధ్వర్యంలో జరిగిన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా 14న దుబ్బాక, 15. హుస్నాబాద్, 16న సిద్దిపేట, 17న గజ్వేల్ నియోజకవర్గాల్లో పర్యటించి ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా డీసీసీ పదవికి గాను 170కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

మారిన నిబంధనలు

గతంతో పోల్చితే ఈసారి కాంగ్రెస్ అధిష్ఠానం నిబంధనలలో మార్పులు, చేర్పులు చేసింది. టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఏఐసీసీ అధిష్ఠానం సూచించిన మేరకు పార్టీలో క్రియాశీలకంగా పాల్గొన్న వారికే డీసీసీ పదవి కట్టబెట్టనున్నది. ఈ మేరకు గతంలో డీసీసీ పదవి అనుభవించిన వారితో పాటు వారి కుటుంబ సభ్యుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. దాంతో పాటుగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో చేరిన వారికి, ప్రజాప్రతినిధుల బంధువులు సైతం డీసీసీ పదవికి పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించింది. ఒకవేళ అలాంటి దరఖాస్తులు వస్తే వాటిని పరిశీలనలోనే తొలగించనున్నారు. కష్టకాలంలో కూడా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని క్రియాశీలకంగా పనిచేసిన వారిని, పార్టీలో కనీసం ఐదు సంవత్సరాలుగా కొనసాగుతున్న వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఆంక్షలను విధించింది.

ఆరుగురి పేర్లు ఏఐసీసీకి అందజేత

170 దరఖాస్తుల్లో ఒక్కో ఆశావాహుడు రెండేసి దరఖాస్తులు అందించగా పరిశీలనలో వాటిని ఏఐసీసీ అబ్జర్వర్‌లు పరిగణనలోకి తీసుకోలేదు. ఆ దరఖాస్తులు తీసివేయగా 120కి పైగా దరఖాస్తులున్నట్లు గుర్తించారు. మారిన నిబంధనల కారణంగా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అందులో 40 మందిని అర్హులుగా నిర్ణయించారు. ఈ 40 దరఖాస్తుల్లో భాగంగా ఈ నెల 18న 15మందిని, 19న 25మంది ఆశావాహులను డీసీసీ పదవికి పోటీ పడుతున్న పలు అంశాలపై ఏఐసీసీ అబ్జర్వర్‌లు ఇంటర్వ్యూలను నిర్వహించారు. చివరగా అర్హులుగా గుర్తించిన ఆరుగురి పేర్లతో పీసీసీలతో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి నివేదిక అందించారు. దాంతో పాటుగా జిల్లాలోని పలువురు కార్యకర్తలు, నాయకులు, ప్రజల నుంచి డీసీసీ పదవికి ఈ ఆరుగురిలో అర్హులెవరోనని అభిప్రాయాలను సేకరించనున్నారు.

ఆశావహుల లాబీయింగ్

జిల్లా అధ్యక్షుడిని మరో రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తారని తెలియడంతో పలువురు ఆశావాహులు పీసీసీ, మంత్రులు, అభిమాన సీనియర్ నాయకుల వద్దకు పరుగులు తీస్తూ లాబీయింగ్ చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో

కర్నూల్ బస్సు ప్రమాద మృతులకు

నేడు అంత్యక్రియలు

- డీఎన్‌ఏ పరీక్షల అనంతరం మృతదేహాల అప్పగింత



సుధారాణి, చందన (ఫైల్)

మెదక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటనలో సజీవ దహనమైన తల్లీకూతుళ్ల మృతదేహాలను ఆదివారం సాయంత్రం అధికారులు బంధువులకు అప్పగించారు. హైదరాబాద్ నుంచి గురువారం సాయంత్రం బెంగళూరు బయల్దేరిన వేమూరి ట్రావెల్ స్లీపర్ కోచ్ టూరిస్టు బస్సు శుక్రవారం తెల్లవారుజామున కర్నూలు సమీపంలో ప్రమాదానికి దగ్ధం కావడంతో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో జిల్లాలోని శివాయిపల్లికి చెందిన తల్లీకూతుళ్లు సుధారాణి, చందన కూడా మృతిచెందారు. ప్రమాదంలో మృతదేహాల ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో, మృతదేహాలను గుర్తించడానికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించారు. మృతుల బంధువుల నుంచి డీఎన్‌ఏ శాంపిల్ సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వేర్వేరుగా కర్నూల్‌లోని అధికారులతో ఫోన్‌లో సంప్రదించి సుధారాణి, చందనల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించాల్సిందిగా సూచించారు. ఆదివారం ఉదయం డీఎన్‌ఏ రిపోర్టు రావడంతో అధికారులు సుధారాణి భర్త ఆనంద్‌గౌడ్‌కు మృతదేహాలను అప్పగించారు. వారి స్వగ్రామమైన శివాయిపల్లిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్ననట్లు బంధువులు తెలిపారు.



నేడు పత్తి కొనుగోలు

కేంద్రాలు ప్రారంభం

గజ్వేల్/దౌల్తాబాద్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జిల్లాలోని పలు మండలాల్లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పర్యటించి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఏఎంసీ కార్యదర్శి జాన్‌వెస్లీ, దౌల్తాబాద్ మండల మాజీ జడ్పీటీసీ సర్వుగారి భూపాల్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్‌లోని సాయిబాలాజీ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ రఘునందన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమాద్‌నగర్ గ్రామ శివారులోని ఉన్న పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ప్రారంభించనున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

- కొమురవెల్లి, కొండపోచమ్మ దర్శనానికి బారులు
- రేపటి నుంచి విజయదుర్గా ఆలయ వార్షికోత్సవాలు

జగదేవ్‌పూర్/కొమురవెల్లి/కొండపాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకొన్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ చేరుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, చిన్న, హరి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ..

కొమురవెల్లిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి బోనాలు చెల్లించి దీపాలను వెలిగించారు. పలువురు భక్తులు ముఖ మండపంలో స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించారు. ఈవో టంకశాల వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మల్లన్న ఆలయ మహామండపంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తుల ఎదుట సర్పసూక్త పారాయణం గావించి దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. మల్లన్న సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రానికి ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన బొడిగె రమాదేవి రాజుగౌడ్ దంపతు లు రూ.50,116 విరాళాన్ని అందించారు.



జగదేవ్‌పూర్ : కొండపోచమ్మ ఆలయంలో..



కొమురవెల్లి : మల్లన్న ఆలయంలో..



విజయ దుర్గామాత స్వర్ణ కిరీటం

ఉత్సవాలకు కంచి కామకోటి పీఠాధిపతులు రాక

కొండపాక మండలం మర్పడగ క్షేత్రంలోని విజయ దుర్గ ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి రెండు రోజులపాటు జరుగుతాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు, దేవి ఉపాసకులు చెప్పేల హరినాథ శర్మ తెలిపారు. బుధవారం 10:30 నిమిషాలకు కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పాల్గొననున్నారు. బుధవారం విజయదుర్గాదేవికి స్వర్ణ కిరీ ట సమర్పణ అనంతరం స్వామివారి భిక్షావందనం, మధ్యాహ్నం శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహ భాషణం ఉంటుంది. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి, వర్గల్ సరస్వతీ ఆలయ ఛైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొననున్నారు.

భార్య కాపురానికి రావడంలేదని..
వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం/గజ్వేల్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటనలు శనివారం సిద్దిపేట జిల్లాలో రెండు చోట్ల చోటుచేసుకున్నాయి. సిద్దిపేట భారత్‌నగర్‌లో ఒకరు పురుగుల మందు తాగి, గజ్వేల్ మండలం రిమ్మనగూడలో మరొకరు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.

సిద్దిపేటలో..


యాదగిరి (ఫైల్)

కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన యాదగిరి(40)కి కొంతకాలంగా భార్యతో విభేదాలు ఉన్నాయి. భార్య కాపురానికి రాకపోవడంతో పాటు, బిడ్డను కూడా చూపించకపోవడంతో యాదగిరి తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. బిడ్డను చూడటానికి యాదగిరి భార్య వద్దకు వెళ్లాడు. అక్కడ భార్యతో పాటు ఆమె కుటుంబసభ్యులు, అక్క, చిన్నాన్న కొడుకు దురుసుగా ప్రవర్తించి బెదిరించారు. దీంతో మరింత మనోవేదనకు గురయ్యాడు. శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాదగిరి మృతికి భార్య, ఆమె బంధువులే కారణమని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్మనగూడలో..


ఎన్నెల్లి కిషన్ (ఫైల్)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం రిమన్నగూడ గ్రామానికి చెందిన ఎన్నెల్లి కిషన్(32)కు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన మమతతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చి గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి కిషన్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు, బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు


గాయపడిన స్వప్న, శంకర్

రాయపోల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కారు, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడిన సంఘటన రాయపోల్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కామారెడ్డి ప్రాంతానికి చెందిన శంకర్ కుటుంబసభ్యులతో కలిసి కారులో గజ్వేల్ ప్రాంతంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. వారు తిరిగి రామాయంపేట వైపు వెళ్తున్న క్రమంలో రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద రామాయంపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న శంకర్, స్వప్నకు గాయాలయ్యాయి. రాయపోల్ ఎస్ఐ మానస సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద తరచూ ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంగారెడ్డిలో భారీ చోరీ

- 30 తులాల బంగారం, రూ.25లక్షల నగదు అపహరణ


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలో ఆదివారం భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అయిన రాములు పట్టణంలోని వసంత్‌నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. శనివారం నాడు రాత్రి రాములు తన కుటుంబసభ్యులతో కలిసి నారాయణఖేడ్‌కు వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం సాయంత్రం తిరిగి సంగారెడ్డికి వచ్చాడు. రాగానే ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల బీరువాలో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసు జాగిలాలతో దర్యాప్తు జరిపారు. బీరువాలో ఉంచిన 30 తులాల బంగారం, రూ.25లక్షల 75వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితుడు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల తాను ప్లాట్ విక్రయించగా వచ్చిన డబ్బుతో బంగారం కొనుగోలు చేయగా, మిగతా నగదును బీరువాలో దాచి పెట్టినట్టు రాములు తెలిపారు. అయితే రాములు ఇంటి పరిసరాల్లో నాలుగు సీసీ కెమెరాలు ఉండగా ఒక్క కెమెరా పనిచేయకపోవడం గమనార్హం.

పెయింటింగ్ పనులు చేస్తుండగా.. విద్యుదాఘాతంతో ఒకరి మృతి


సతీష్‌గౌడ్(ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెయింటింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి కరెంటు షాక్‌తో ఒకరి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన తీగల సతీష్‌గౌడ్(40) పెయింటింగ్ పనులు చేసేందుకు తూప్రాన్ వచ్చాడు. తూప్రాన్ పట్టణంలో ఓ భవనానికి రూలర్ సహాయంతో పెయింటింగ్ వేస్తుండగా, రూలర్ కరెంట్ వైర్లకు తగిలడంతో సతీష్‌గౌడ్‌కు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తూప్రాన్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైనా చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ మేరకు తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగిన వ్యక్తి..


వెంకటేశం(ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజీపేట గ్రామానికి చెందిన బండారు వెంకటేశం(32) గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వైన్స్‌షాప్ పర్మిట్‌రూంలో అతిగా మద్యం తాగి కిందపడి మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు పిల్లలు సాయిపల్లవి, అభినయ్ ఉన్నారు. మృతుడు వెంకటేశం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హల్దీ వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి గ్రామ శివారు హల్దీ వాగులో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం ఆదివారం వాగులో మృతదేహం తేలియాడుతుండం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంతో నీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని తెలిపారు. ఎక్కడి నుంచో వచ్చి ఆత్మహత్య చేసుకుందా లేదా అదృశ్యమై వాగులో పడి మృతిచెందిందా అని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైన కేసులు ఆదివారం నమోదయ్యాయి. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న మోహన్ ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 24వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి ఆటోతో వెళ్లి, తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాప్ అయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో భార్య పల్లవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


మోహన్

మరో కేసులో.. పటాన్‌చెరు శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాల్‌రెడ్డి వెల్జాన్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. 24వ తేదీన సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వచ్చారు. బయటకు వెళ్లి వస్తానని చెప్పిన బాల్‌రెడ్డి తిరిగి రాలేదు. భార్య సమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


బాల్‌రెడ్డి

పేకాట స్థావరాలపై దాడులు

- జహీరాబాద్, కొండాపూర్‌లో 35 మంది అరెస్ట్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో, మెదక్ జిల్లా రేగోడు మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది దాడి చేసి 35 మందిపి అదుపులోకి తీసుకుని, నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కొండాపూర్ శివారులో 19 మంది అరెస్ట్

రేగోడు అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఓషెడ్డులో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు అల్లాదుర్గం సీఐ రేణుక ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన నందు, లావ్య, రోహిత్ హైదరాబాద్, పటాన్‌చెరు శంకర్‌పల్లి, జనవాడ, చేవెళ్ల, అల్వాల్ ప్రాంతంలో నివసిస్తున్న కొందరు యువకులను పేకాట ఆడిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలసి దాడి చేసి పేకాట ఆడుతున్న 19 మంది యువకులను పట్టుకున్నారు. రూ2.19లక్షలు నగదు. ఎనమిది సెల్‌ఫోన్లు, ఒక కారు, ఆటో, బైక్ స్వాధీన చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జహీరాబాద్‌లో పట్టుబడిన 16 మంది

జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై శనివారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్యనగర్‌లో ఓ ఇంట్లో 11 మంది, మరో ఇంట్లో ఐదుగురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా వారివద్ద రూ.64,000 నగదు, పేకముక్కలు లభించాయి. వాటన్నింటిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు కేసు నమోదు చేశారు.




రెడీమిక్స్ వాహనాల నిర్లక్ష్యం



జహీరాబాద్ ప్రాంతంలో రెడీమిక్స్ కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా తారు రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న రెడీమిక్స్ వాహనాలు రోడ్లపై ఇష్టారీతిన కంకర, సిమెంట్ మిక్చర్‌ను పడేస్తుండటంతో, అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం రోడ్లపై పడిన ఈ వ్యర్థాలను తొలగించడంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. స్థానికులు రెడీమిక్స్ నిర్వాహకులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రెడీమిక్స్ కేంద్రాలకు సరైన అనుమతులు లేకపోవడం, ఓవర్‌లోడ్ వాహనాలపై ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

- జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ఫటాఫట్

- అంతర్రాష్ట్ర నేరస్థులపై నిఘా
- శాంతిభద్రతల పరిరక్షణకు కృషి
- జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్



జహీరాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ స్పష్టం చేశారు. గంజాయి, గుట్కా, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

డివిజన్ పరిధిలో సీసీ కెమెరాల సంఖ్య ఎంత?

డివిజన్ వ్యాప్తంగా సుమారు 800 సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటిని ప్రధాన కూడళ్లలో, అత్యవసరం ఉన్న ప్రాంతాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేశాం. నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వ్యాపార సంస్థలు, పరిశ్రమల యజమానులు, ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి?

డివిజన్‌లోని ప్రధాన కూడళ్లలో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా చూస్తున్నాం. జహీరాబాద్ పట్టణం అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం వేల సంఖ్యలో వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. ట్రాఫిక్ నియంత్రణకు పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అత్యవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. అదనపు సిబ్బంది అవసరం ఉందని ఉన్నతాధికారులకు తెలిపాం.

శాంతిభద్రతలకు తీసుకుంటున్న చర్యలు?

ఫ్రెండ్లీ పోలిసింగ్‌లో భాగంగా ప్రజలు, నాయకులు, పోలీసుల సహకారంతో పనిచేస్తున్నాం. అనుకోకుండా జరిగే దొంగతనాలు, హత్యలు వంటి సంఘటనల విషయంలో ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.స్థానిక పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిస్తూ సమస్యలు జటిలం కాకుండా చూస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

అంతర్రాష్ట్ర నేరస్థులపై నిఘా పెంచాం. జహీరాబాద్ డివిజన్ కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం. జాతీయ రహదారి (ఎన్‌హెచ్65) 60 కిలో మీటర్ల మేర డివిజన్ గుండా వెళ్తున్నది. వివిధ ప్రాంతాలకు చెందిన నేరస్థులు ఇటుగా ప్రయాణిస్తుంటారు. హైవే పెట్రోలింగ్, మఫ్టీలో గస్తీలు, నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. జహీరాబాద్ రూరల్, చిరాగ్‌పల్లి, కోహీర్, హద్నూర్ పోలీస్‌స్టేషన్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. ఈ ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్లకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా బాధితులు వస్తుంటారు. ముఖ్యంగా దారిదోపిడీలు, దొంగతనాలు, ఆస్తి తగాదాలు, కుటుంబసమస్యలు, సైబర్ మోసాల బాధితులు వస్తుంటారు. ప్రతీ సమస్యను పోలీసులు పరిశీలించి, వివాదాలకు తావివ్వకుండా పరిష్కరిస్తున్నారు.

రాచన్నస్వామి ఆలయంలో కార్తీక శోభ



రాచన్న స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా కోహీర్ మండలంలోని బడంపేట గ్రామంలోని రాచన్నస్వామి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం అన్ని పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కలు తీర్చున్నారు. అలాగే భక్తులు అమృత గుండంలో స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏడుపాయల్లో భక్త జనసందోహం



అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

పావన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గ భవానీమాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. అర్చకులు వేకువజామున ఆలయ గర్భగుడిలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

స్థానిక సాహిత్యానికి పట్టాభిషేకం



పాఠ్య ప్రణాళిక మండలి సమావేశం (ఫైల్)

సిద్దిపేట డిగ్రీ కళాశాల తెలుగు పాఠ్య ప్రణాళికలో విప్లవాత్మక మార్పులు

అటానమస్ నిబంధనల మేరకు స్థానిక పాఠ్యాంశాల చేరిక

డా.నందిని సిధారెడ్డి, సిద్దెంకి యాదగిరి, ఐతా చంద్రయ్య రచనలు ఎంపిక

కొత్తకొండ చరిత్ర, ఓరుగల్లు సందర్శన పాఠాలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) తెలుగు విభాగం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దశాబ్దం పాటు స్వయంప్రతిపత్తిని పూర్తి చేసుకున్న నేపథ్యంలో తొలిసారిగా డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలలో సమూల మార్పులు చేపట్టింది. పదే పదే పునరావృతమవుతున్న పాత, స్థానికేతర పాఠ్యాంశాల స్థానంలో తెలంగాణ ప్రాంతానికి, ముఖ్యంగా సిద్దిపేట పరిసర ప్రాంతాలకు చెందిన స్థానిక సాహితీ సౌరభానికి పెద్దపీట వేస్తూ కొత్త పాఠ్యప్రణాళికను రూపొందించింది.

ఇప్పటికే పలుమార్లు పునరావృతవుతూ వస్తున్న పాత, స్థానికేతర పాఠ్యాంశాల స్థానంలో కళాశాల తెలుగుశాఖ కొత్త పాఠాలు పెట్టుకున్నది. గతంలో 2023- 24లో పీజీ పాఠ్య ప్రణాళికలో వరకవి సిద్దప్ప పాఠ్యాంశాన్ని చేర్చారు. డిగ్రీలో ఇదే మొదటిసారి. స్వయం ప్రతిపత్తి (అటానమస్) నిబంధనల ప్రకారం 20 నుంచి 30 శాతం మేర పాఠ్యప్రణాళికను మార్పు చేసుకునే అవకాశం ఉన్నందున 25 శాతం పాఠ్య ప్రణాళికను మార్పు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటైన పాఠ్య ప్రణాళిక మండలి ఆధ్వర్యంలో మార్పులు చేర్పులు చేశారు. ఈ పాఠ్యమండలి మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి అధ్యక్షుడిగా, తెలుగు విషయక నిపుణులు చింతకింది కాసీం, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, వంగల సంపత్‌రెడ్డి, చిలుముల శ్రీనివాస్, గరిపల్లి అశోక్, పిట్లదాసు, నారోజు వెంకటరమణ సభ్యులుగా ఈ బృందం డిగ్రీ మొదటి సంవత్సరం ద్వితీయభాష, ఆధునిక భాష సబ్జెక్టుల కోసం ఈ పాఠ్య ప్రణాళికను ఆమోదించింది.

పాఠ్యాంశాల మార్పు... న్యాక్ సైకిల్

న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) అంటే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల నాణ్యత స్థాయిని మూల్యాంకనం చేసే జాతీయ సంస్థ. కళాశాల మొదటిసారి గుర్తింపు పొందినప్పుడు సైకిల్-1గా పరిగణిస్తాం. వరుసగా న్యాక్ గుర్తింపు సాధిస్తే సైకిల్-2, సైకిల్-3 అని సూచిస్తారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి న్యాక్ గుర్తింపు ఉంటుంది. ఈ మేరకు న్యాక్ సైకిల్-2లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం 20 నుండి 30 శాతం మేర పాఠ్యప్రణాళికను మార్పు చేసుకునే అవకాశం ఉన్నందున 25 శాతం పాఠ్యప్రణాళికను మార్పుచేశారు.

చేర్చిన పాఠ్యాంశాలివే..

- డిగ్రీ ద్వితీయ భాష (సెకండ్ లాంగ్వేజ్)తో పాటుగా ప్రత్యేకంగా తెలుగు సబ్జెక్ట్‌గా ఉండే మోడ్రన్ లాంగ్వేజ్ (ఆధునిక భాష)కు సంబంధించిన పాఠ్యాంశాలను మార్పులు చేశారు. ఇందులో భాగంగా గజ్వేలు సమీపంలోని క్షీరసాగరం గ్రామానికి చెందిన రాళ్లబండి రాఘవశాస్త్రి 1950 నాటికే పద్యకావ్యాలు రాసి ప్రచురించిన సాహితీవేత్త. కుగ్రామంలో సొంత ఖర్చులతో ముద్రణాశాలను నడిపించి తెలంగాణ సాహిత్య వికాసానికి బాటలు వేసిన సాహితీమూర్తి. రాఘవశర్మ రచించిన రైతు ఋణవిముక్తి కావ్యం నుంచి 'సేద్య జీవితం' అనేపాఠాన్ని పాఠ్యాంశంగా తీసుకున్నారు.
- భారతదేశంలో విలీనమైన వెంటనే విశాలాంధ్ర కోసం పెనుగులాట మొదలైనప్పుడు దాన్ని వ్యతిరేకించిన కవులలో ఖమ్మం జిల్లా గోకినేపల్లికి చెందిన రావెళ్ల వెంకట రామారావు ఒకరు. తను రాసిన గేయాలలో ధీరులకు మొగసాలరా తెలగాణ అనే దేశభక్తి గీతానికి మలి తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట నుంచే తొలిప్రచారం లభించింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మాతృ గీతిక పేరుతో తెలగాణ గీతాన్ని పాఠ్యాంశంగా చేర్చారు.
- హుస్నాబాదు సమీప ప్రాంతాలకు అతిపెద్ద పుణ్యక్షేత్రం, గొప్ప చారిత్రక స్థలం కొత్తకొండ. ప్రతీ సంక్రాంతికి జరిగే కొత్తకొండ వీరభద్రస్వామి జాతర తెలంగాణలోని ప్రముఖ జాతరలలో ఒకటి. ఈ క్షేత్రంలో తలనీలాల క్షురకుడిగా పనిచేసిన కొత్తకొండవాసి కొలిపాక వీరమల్లు పుల్లయ్య తన జన్మస్థలపు చారిత్రక సాంస్కృతిక విశేషాలను కొత్తకొండ చరిత్ర పేరుతో పుస్తకంగా అచ్చు వేసారు. కొత్తకొండ గ్రామ చారిత్రక ఐతిహ్య విశేషాలను క్రోడీకరిస్తూ అదే పేరుతో పాఠ్యాంశం రూపకల్పన చేశారు.

మన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి

దాదాపు 20 రోజుల పాటు విస్తృత చర్చల అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్థానికతకు పట్టం కడుతూ ఈ పాఠ్యాంశాలను చేర్చాం. స్థానికతను, మన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి. ఈ పాఠ్యాంశాల అభ్యసనం ద్వారా డిగ్రీ స్థాయి విద్యార్థులలో ఉత్తమ వ్యక్తిత్వ విలువలు, భాషా సాంస్కృతిక అంశాలపట్ల సముచిత అభిరుచులు పెరుగుతాయి

- డా.మట్టా సంపత్ కుమార్‌రెడ్డి, పాఠ్య ప్రణాళిక మండలి అధ్యక్షుడు



- వినుకొండ వల్లభరాయని పేరిట శ్రీనాథుడు రాసిన వీధి నాటకం ఆనాటి రాజధాని నగరమైన ఓరుగల్లు నగర సందర్శనం ఇతివృత్తంతో నడుస్తుంది. ఇందులోని ఏకవీర రేణుకామాత గుడులు, బవనీలు, శివసత్తులు, షైలారభటులు, ఓరుగంటిలో పూటకూళ్ల ఇంటిలో ఒక్క రూకకే దొరికే కమ్మటి వరికూడు భోజనం మొదలైన విశేషాలతో కూడిన 15 శతాబ్దపు అచ్చమైన తెలంగాణ సంస్కృతిని చిత్రించే పాఠాన్ని ఓరుగల్లు సందర్శన అనే పేరుతో రూపకల్పన చేశారు.
- తెలుగు కథాకావ్యాలలో తెలంగాణ సామాజిక జీవితాన్ని, బహువిధమైన స్థానికతను విశేషంగా నమోదుజేసిన కావ్యం సింహాసన ద్వాత్రింశిక. ఈ కావ్యకారుడు కొరవి గోపరాజు నిజామాబాదు జిల్లా భీముగల్లు నివాసి. సింహాసన ద్వాత్రింశిక నుంచి గుడ్డేలుగు-పెద్దపులి సంవాదం పాఠంగా తీసుకోబడింది. మనుషులకే కాదు, జంతువులకూ అస్తిత్వం పట్ల తగినంత స్పృహ ఉంటుందనే దృగ్విషయాన్ని ఈ కథ తెలియజేస్తుంది.
- కవిగా, కథకుడుగా, రచయితగా, పరిశోధకుడుగా, ఉద్యమవేత్తగా ఆధునిక తెలుగు భాషాసాహిత్యాలలో డా.నందిని సిధారెడ్డిది ప్రముఖమైన ముద్ర. తన సంభాషణ కవితా సంపుటి నుంచి కొంగలు అనే వచన కవితను పాఠ్యాంశంగా స్వీకరించారు. సహజ వనరుల విధ్వంసం నేపథ్యంలో పర్యావరణ మానవీయ స్పృహలను యువతలో పునరుత్తేజం చేయటం కోసం ఈపాఠం ఎంపికైంది.
- సిద్దిపేట ప్రాంతంలో ఐతా చంద్రయ్య సీనియర్ కథకుడు. పలు ప్రక్రియలలో బహు గ్రంథకర్త. ఆరు వందలపైచిలుకు కథలు రాసి ఇరువైమూడు కథా సంపుటాలు ప్రచురించారు. వీరి సాహితీ కృషిని నేటి విద్యార్థులకు గుర్తింపజేస్తూ మంచు ముద్ద కథను పాఠ్యాంశంగా పెట్టారు. ఈ కథను కేంద్ర సాహిత్య అకాడమీ పలు భారతీయ భాషలలోకి అనువాదం చేసింది.
- సిద్దిపేట ప్రాంతానికి చెందిన వర్తమాన కథకుడు, పరిశోధకుడు, విమర్శకుడు, పుస్తక ముద్రకుడు సిద్దెంకి యాదగిరి రాసిన నిలువెత్తు దుఃఖం ఇటీవలి ప్రాజెక్టుల నిర్మాణాల వలన ఛిద్రమైన ముంపు గ్రామాల వెతలను చిత్రించిన కథ. మల్లన్నసాగర్‌లో మునిగిన వేములఘాట్ పాఠశాల ఉపాధ్యాయుడుగా తాను చూసిన గాథలను కథగా మలిచినందున ఈ కథ అదే పేరుతో పాఠ్యాంశంగా చేర్చారు.
- ఇవేగాక తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలితరం విమర్శకులు కోవెల సంపత్ కుమారాచార్య, బిరుదురాజు రామరాజు, పాకాల యశోదారెడ్డి పరిచయాలను తీసుకున్నారు.

భారతీయ సాంస్కృతిక విలువలను తరతరాలకు అందించాలి

- సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు

గజ్వేల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సాంస్కృతిక విలువలను తరతరాలకు అందించాలని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో సంచార జాతుల కళా ప్రదర్శనలు కార్యక్రమాన్ని సామాజిక సమరసతా వేదిక, విముక్త సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సమరసతా వేదిక ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ.. భారతీయ విలువలు, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వివిధ వర్గాలకు, ఆశ్రిత కులాలకు కుల చరిత్రలు చెప్పే జీవనం గడిపే విముక్త సంచాల జాతుల కళలు సమాజ చైతన్యానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో వారి కృషి ఎనలేనిదని, ప్రజలను జాగృతం చేస్తూ స్వావలంబన, సంస్కృతి, ఆత్మగౌరవం కోసం ప్రజలు నిలబడేలా చేయడంలో వారి పాత్రను కొనియాడారు. 32 సంచార జాతుల కళా ప్రదర్శనలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. వారితో విముక్త సంచార జాతుల అభివృద్ధి మండలి ప్రధాన కార్యదర్శి చిరంజీవి, రుక్మిణి, మంద సాయినాథ్‌రెడ్డి, నాగేందర్, శ్రీధర్ తదితరులున్నారు.



సంచార జాతుల కళా ప్రదర్శనలో ఆవిష్కరిస్తున్న పోస్టర్

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన
హామీ నిలబెట్టుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు నవంబర్ నెలలో ప్రకటించి అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులు ప్రతీ నెల రూ.700 కోట్లు విడుదల చేసి ఉద్యోగుల ఖాతాలో జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 రూల్స్ అనుగుణంగా హైకోర్టు తీర్పు మేరకు డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డాపై ఆకలి పోరాటం

తూప్రాన్‌లో వందలాది కూలీలు... పని దొరకక పడిగాపులు

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షణ

తక్కువ కూలీకి యూపీ, బీహార్ కార్మికులు సిద్ధం

స్థానికులకు కష్టంగా మారిన పనులు



తూప్రాన్ పట్టణంలో పనుల కోసం నిరీక్షిస్తున్న కూలీలు

తూప్రాన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బతుకు బండిని నడపడానికి, పూట గడవడానికి కూలి పనులు దొరకడం స్థానిక కార్మికులకు గగనంగా మారింది. ఒక్క పని కోసం వందలాది మంది అడ్డా కూలీలు ప్రతీ రోజు నిరాశతో పడిగాపులు కాస్తున్నారు. పని దొరకక ఇంటికి వెళ్లడం అంటే ఆ రోజు పస్తులుండక తప్పదు అనే పరిస్థితి మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కనిపిస్తోంది.

తెల్లవారుజామునే అడ్డా వద్దకు..

తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత హైవే రోడ్డు కూలీల అడ్డాగా మారింది. శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, చిన్నశంకరంపేట, సిద్దిపేట జిల్లాకు చెందిన రాయపోలు, దౌల్తాబాద్, వర్గల్ వంటి పలు మండలాల నుంచి నిత్యం సుమారు 400 నుంచి 500 మందికి పైగా కూలీలు తెల్లవారుజామున 6 గంటలకే సద్దిమూటలు కట్టుకొని ఇక్కడికి చేరుకుంటున్నారు. ఎవరైనా యజమానులు వచ్చి తమను పనులకు తీసుకెళ్తారా అని మధ్యాహ్నం వరకు ఎదురుచూస్తుంటారు. గృహ నిర్మాణ పనులు మొదలుకుని ఏ పని అయినా చేసేందుకు సిద్ధంగా ఉంటారు. ఆరోజు పని దొరికితే ఆనందం, లేకుంటే నిరాశే మిగులుతోంది.

ఉపాధి హామీలో తక్కువ కూలి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు గరిష్టంగా రూ.300 వరకు మాత్రమే కూలి లభిస్తోంది. ఈ తక్కువ కూలి డబ్బుతో, అదీ సమయానికి అందక బతుకు వెళ్లదీయడానికి సరిపోకపోవడంతో, కూలీలు అధిక డబ్బులు వచ్చే ఇతర పనుల కోసం మొగ్గు చూపుతున్నారు. అయితే, అక్కడ కూడా పనులు దొరకడం గగనమై నిత్యం పనుల వేటలో నిరీక్షించాల్సి వస్తోంది.

యూపీ, బీహార్ కూలీల పోటీ

అసలే కూలీ బతుకులు అంటే అందులోనూ ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు పోటీపడుతుండడంతో స్థానిక కూలీలకు పని దొరకక జీవితాలు కష్టాల సుడిగుండంలో నెట్టబడుతున్నాయి. గతంలో హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు సైతం చేరుకున్నారు. అతి తక్కువ కూలి డబ్బుకే పనులు చేయడానికి వీరు సిద్ధపడటంతో, యజమానులు వీరి వైపే మొగ్గు చూపుతున్నారు. అంతేకాక, శ్రమ అధికంగా ఉండే పనులను కూడా వీరు చేస్తారనే భావనతో వారిని పనులకు పిలుస్తున్నారు. ఫలితంగా, స్థానికంగా పనులు దొరకని కూలీలు, ఇప్పుడు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.



పనులు వెతుకుంటున్నాం

కూలీ పనులు లభించకపోవడంతో వెతుకుంటూ దూరంగా ఉన్నా వెళుతున్నాం. పనుల కోసం రోజంతా పడిగాపులు గాస్తున్నాం. పనులు దొరకకపోతే డబ్బు లేక ఒక్కో రోజు ఉపవాసం ఉంటున్నాం. ప్రభుత్వం కూలీలను ఆదుకోడానికి పథకాలు అమలు చేయాలి. వర్షాల కారణంగా వ్యవసాయ పనులు తగ్గిపోయాయి. కూలీలకు పనులు పనులు కల్పించాలి.

- యాదగిరి, రామాంతపూర్, మాసాయిపేట మండలం



ఇతర కూలీలతో ఇబ్బందులు

కూలి పనులు చేసేందుకు ఇతర రాష్ట్రాల ప్రజలు రావడంతో పనులు దొరకడం కష్టంగా మారింది. ఊర్లలోనూ వారే పనులు చేస్తున్నారు. గ్రామాల్లోనూ మమ్మల్ని పిలువడంలేదు. పనులు వెతుక్కుంటూ ఎంత దూరమైన వెళ్తున్నాం. జంగరాయి నుంచి తూప్రాన్‌కు దూరంగా ఉన్న పనుల కోసం వస్తు కూలి పనుల కోసం నిరీక్షిస్తున్నాం. స్థానికులకు పనులు కల్పిస్తే ఇబ్బందులు తీరుతాయి.

- మంగమ్మ, జంగరాయి, చిన్నశంకరంపేట మండలం

సైక్లింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు

- డీవైఎస్‌వో జంగపల్లి వెంకట నర్సయ్య

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిత్యం సైకిల్ సాధన చేసినట్లయితే వాతావరణ కాలుష్య నివారణతో పాటు, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంతేకాకుండా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి(డీవైఎస్‌వో) జంగపల్లి వెంకటనరసయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్వహించిన 20 జిల్లాస్థాయి సైకిల్ పోటీలను రూరల్ సీఐ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ నిత్యం సైకిల్ సాధన చేయడం వలన అనేక లాభాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. సైక్లింగ్ బాల్యం నుంచే అభ్యసిస్తే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. సైకిల్ తొక్కినట్లయితే శారీరక సౌష్టవంతో పాటు, మానసిక ఎదుగుదల లభిస్తుందన్నారు. ఈ సైక్లింగ్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించి ప్రతిభావంతులైన వారిని ఈనెల 31, వచ్చే నెల ఒకటి రెండు తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రభ, పాఠశాల క్రీడా సమాఖ్య మాజీ కార్యదర్శి పాతూరి సుజాత, క్రీడా సంఘాల కార్యదర్శులు ఉప్పలయ్య, ఖేల్ ఇండియా సైక్లింగ్ కోచ్ సంజీవ్, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో జంగపల్లి వెంకటనరసయ్య, సీఐ శ్రీనివాస్

పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 26 : కార్మిక చట్టాలను అమలు చేయని జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీరాం క్లోరో పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికుల అక్రమ బదిలీలు, సస్పెండ్లు, టర్మినేషన్‌లను వెంటనే ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

గ్రామీణ రోడ్లకు మోక్షమెన్నడో?

- ఇటీవల వర్షాలకు కొమురవెల్లి మండలంలో అధ్వానంగా మారిన రోడ్లు
- అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- నేటికీ కొన్ని గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు
- కొన్నిచోట్ల కంకర పోసి వదిలేయడంతో ఇబ్బందులు



గుంతలమయంగా మారిన గురువన్నపేట- తపాస్‌పల్లిమట్టి రోడ్డు, కొమురవెల్లి నుంచి గౌరాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో కంకర వేసి వదిలేసిన దృశ్యం

కొమురవెల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారడంతో ఆయా గ్రామస్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు సమీపంలోకి వచ్చేవరకూ గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి గాయాలబారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల మధ్య ఇప్పటికీ మట్టి రోడ్లే ఉండటంతో ప్రతీ వర్షాకాలంలో రోడ్డు కొట్టుకుపోవడం, కోతలకు గురై ఆయా గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు.

అధ్వాన రోడ్లతో ఇబ్బందులు

కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి గ్రామ ప్రజలు మట్టిరోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రతిసారి వర్షాకాలంలో మట్టిరోడ్డు గుంతలమయంగా మారడం, కొన్నిసార్లు భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్డు కొట్టుకుపోవడం వల్ల మండలకేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో గ్రామం నుంచి పొరుగు గ్రామాలకు చేరుకోవడానికే చాలా సమయం పడుతుందంటూ ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అలాగే మండలకేంద్రం నుంచి గౌరాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే క్రమంలో కాంట్రాక్టర్ కంకర పరచి వదిలేయడంతో అటుగా వెళ్లే గౌరాయపల్లి, మర్రిముస్త్యాల గ్రామాల ప్రజలు కంకరరోడ్డు, గుంతలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీరాజ్ రోడ్ల విభాగం అధికారులు స్పందించి మట్టిరోడ్లను బీటీరోడ్లుగా, కంకర పరచి వదిలేసిన రోడ్లను పూర్తి చేయాలని కోరుతున్నారు.

మట్టిరోడ్డుతో తిప్పలు పడుతున్నాం

మండల కేంద్రం నుంచి మా గ్రామమైన తపాస్‌పల్లికి వెళ్లే దారిలో గురువన్నపేట వరకు బీటీ రోడ్డు ఉన్నప్పటికీ, ఆ గ్రామం నుంచి సుమారు 3 కి.మీ. మేర మట్టిరోడ్డు ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భారీ వర్షాలకు మట్టి రోడ్డుపై నుంచే వరదనీరు ప్రవహిస్తుండటంతో వరద ప్రవాహం తగ్గే వరకు వ్యవసాయ బావుల దగ్గరకు, మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

-పుట్ట రమేష్ తపాస్‌పల్లి

డేంజర్‌జోన్‌గానే ముస్త్యాల శివారు

చేర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట ప్రధానదారి విస్తరణకు నోచుకున్నా చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామశివారు ప్రాంతంలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. ఈ ప్రాంతం డేంజర్‌జోన్‌గానే నిలవడంతో ప్రమాదాలు చోటుచేసుకుని వాహనదారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో సింగిల్ లేన్ బీటీ రోడ్డుగా ఉండగా, గ్రామశివారులోని ప్రగతి విద్యానికేతన్ సమీపంలో మూలమలుపువద్ద వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. కొద్ది రోజులక్రితం వరకు ఎన్నో వాహనాలు బోల్తాపడి పలువురు మరణించగా, మరెంతోమంది గాయాలపాలయ్యారు. రోడ్డును విస్తరించాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తున్న క్రమంలో సూర్యాపేట -సిరిసిల్ల 365బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణ చేపట్టారు. మూలమలుపుతో పాటు కల్వర్టును సరిచేసి బీటీ వేసినప్పటికీ పనుల్లో నాణ్యత కొరవడి కొద్దిరోజులకే రోడ్డు కుంగిపోయింది. కల్వర్టు అంచుల వద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో బీటీ తొలగించి సవరించకపోవడంతో కంకర తేలి గుంతలమయంగామారింది. సలాక్‌పూర్ క్రాస్‌రోడ్ స్టేజీ నుంచి ముస్త్యాల మూలమలుపు వరకు రోడ్డు ఏటవాలుగా ఉండటంతో వాహనాలు దూసుకువస్తున్నాయి. అదుపు కోసం ప్రత్యామ్నాయచర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కల్వర్టు వద్ద గోతులకారణంగా ఓ డీసీఎం వెనకటైర్ బ్యానెట్ ఊడిపోయింది. రోడ్డువిస్తరణతో ప్రమాదాలకు చెక్ పడుతుందని భావించినప్పటికీ, సాంకేతిక లోపాలు సరిచేయకపోవడంతో పాటు నాణ్యతలేమి పనులతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీంతో ముస్త్యాల శివారు మూలమలుపు అంటేనే వాహనదారులు ఆందోళన పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపు కల్వర్టు వద్ద వాహనాలు అదుపుతప్పకుండా మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ముస్త్యాల గ్రామశివారులో కల్వర్టు వద్ద ప్రమాదకరంగా గోతులు

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి


మహాసభలకు హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన కార్మికుల 8 నెలల పెండింగ్ బిల్లులు వేతనాలు చెల్లించి, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి పేర్కొన్నారు. లేనిపక్షంలో నవంబర్ 1 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల విధులను బంద్ చేసి నిరసన తెలుపుతామని ఆయన హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల 4వ జిల్లా మహాసభ ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారంగా ప్రతి నెలా రూ.10 మేలు చెల్లించాలన్నారు. దాదాపు 9 నెలల నుంచి బిల్లులు అందక, వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులు చేసే భవిష్యత్తు పోరాటాలకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ఈ మహాసభలో లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెల్లి రాజమణి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాల్‌లక్ష్మి, ప్రమీల, సంతోష, భూలక్ష్మి, లతా, మల్లమ్మ, శారద, భాగ్య, నరసవ్వ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


తునికి బొల్లారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విజయ్‌మోహన్

ములుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్ పేర్కొన్నారు. ఆదివారం ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో ములుగు, క్షీరసాగర్. తునికి బొల్లారం. నర్సాపూర్. కొట్టాల. కొత్తూరు గ్రామాల్లో ప్యాక్స్ వైస్‌చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తుందని రైతులు వరి ధాన్యాన్ని దళారుల అమ్మకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్తా, కొన్యాల బాల్ రెడ్డి, రాములుగౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, స్వరూప్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా గల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల జిల్లా సమన్వయ అధికారి, చేర్యాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో చేర్యాల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్ నెం. 97045 50193కి కాల్‌చేసి సంప్రదించాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కొమురవెల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన గొడుగు మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్ రెడ్డి తండ్రి రాంరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఆయన వెంట కొత్తపల్లి రవీందర్ రెడ్డి,కొయ్యడ బాల్‌నర్సయ్య, మందడి కరుణాకర్, వెంకటేష్, కనకయ్య ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిన్నకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైంది. అల్లీపూర్ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావివద్ద చెట్ల పొదల్లో గుర్తు తెలియని పురుషుడి మృత దేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సైఫ్ అలీ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందంతో పరిసరాలను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి హిందువు అని భావిస్తున్నట్టు తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, నీలి రంగు టీ షర్ట్, తెలుపు రంగు బనీను ధరించి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

నారాయణఖేడ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్ వార్డు వాసులు నీటి కోసం ఆదివారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. తమ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మన్సూర్‌పూర్‌లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.


మద్దూరు-నర్సాయపల్లి రోడ్డు ముస్త్యాల చౌరస్తాలో పెరిగిన చెట్లతో ప్రమాదకరంగా మూలమలుపులు

మూలమలుపులతో పొంచిఉన్న ప్రమాదం

మద్దూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలో మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మండలకేంద్రం నుంచి చేర్యాల మండలం ముస్త్యాలకు వెళ్లే సింగిల్ రోడ్డులో ఇండేన్ గ్యాసు గోదాం వరకు రోడ్డును కమ్మేసిన చెట్లతో మూలమలుపులు డేంజర్ స్పాట్‌లుగా మారాయి. నిత్యం సిద్దిపేట నుంచి చేర్యాల మీదుగా హుస్నాబాద్‌తో పాటు జనగామ జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు ప్రయాణిస్తుండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం ఈ దారిలో పోలీసులు సైతం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. గతంలో పలువురు ద్విచక్రవాహన దారులు పెట్రోల్ పంపు వద్ద గల మూలమలుపుతో పాటు కల్వర్టు ముందున్న మూలమలుపులోఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొన్న ఘటనలో ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాలతో బయట పడ్డారు. గతంలో స్థానిక పోలీసులు ఎస్‌ఐ ఆధ్వర్యంలో మూలమలుపుల వద్ద గల చెట్ల కొమ్మలను తొలగించి ప్రయాణం సాఫీగా జరిగేలా చేసిన సందర్భాలున్నాయి.

ప్రస్తుతం ఈ మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లతో నిత్యం ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు ఈ మూలమలుపుల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మద్దూరు పెట్రోల్ పంపు ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

పత్తి రైతులకు ఇబ్బందులు రానివ్వం


పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన శివారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు ఇబ్బందులు రానీయబోమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పత్తి కొనుగోలు పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన చిట్కుల శివారెడ్డిని ఆయన ఆదివారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులకు ఇబ్బందులు రానీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించినట్లు తెలిపారు. రైతులు కపాస్ యాప్‌ను ఉపయోగించి స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయించాలని, సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రానీయకుండాహెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని జిన్నింగ్ మిల్లుల యజమానులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, నక్క రాములు, యాదగిరి, గాడిపల్లి శ్రీనివాస్, గుంటుకు శ్రీనివాస్, అజ్గర్, అరుణ్ తదితరులున్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిన నర్సింలు

తైక్వాండోతో ఆత్మరక్షణ, మానసిక పరిపక్వత సాధ్యం

గజ్వేల్ రూరల్ 26 అక్టోబరు (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు, మానసిక పరిపక్వతకు తైక్వాండో ఎంతో కీలకం అని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిన నర్సింలు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ టెస్టు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేశబోయిన నర్సింలు హాజరయ్యారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నారన్నగారి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కుంట సత్యం తైక్వాండో అసోసియేషన్ స్వామి తదితరులు ఉన్నారు.

'కిక్కు' ప్రాప్తిరస్తు!

(5వ పేజీ తరువాయి)

రెండేళ్ల పాటు నిర్వహణ, లాభనష్టాలపై అంచనా వేసుకొని నిర్వహణ బాధ్యత తీసుకోకుండా వేరే వ్యక్తులకు దుకాణాల లైసెన్స్‌లను విక్రయించుకోనున్నారు. గతంలో కూడా రూ. 2లక్షలకు దరఖాస్తు చేసుకుని మద్యం దుకాణం దక్కించుకున్న పలువురు, ఆసక్తి ఉన్న వ్యాపారులకు రూ. 50లక్షల నుంచి రూ. 70 లక్షలకు విక్రయించారు. ఈసారి కూడా రూ. 3 లక్షలు చెల్లించి మద్యం దుకాణాలు దక్కించుకున్న పలువురు అదే బాటలో అమ్ముకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఏదేమైనా మద్యం దుకాణాలు ఎవరికి దక్కుతాయో మరికొన్ని గంటల్లో తేలనున్నది.

డీసీసీ

(5వ పేజీ తరువాయి)

కానీ ఈసారి మారిన నిబంధనల మేరకు ఆశావాహులు ఎలాంటి పైరవీలు చేయవద్దని, అర్హుడని పక్కాగా సేకరించిన సమాచారంతోనే డీసీసీగా నియమిస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా చేపడుతారో లేదోనని పలువురు ఆశావాహులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌తో పాటు ఢిల్లీలోని ఏఐసీసీ నాయకుల వద్దకు వెళ్లి సిద్దిపేట డీసీసీ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ రెండు, మూడు రోజుల్లో నూతన డీసీసీ ఎవరోననే ఉత్కంఠకు ఏఐసీసీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెరదించనున్నారు

బూటకపు ఎన్‌కౌంటర్లతో ఉద్యమాన్ని ఆపలేరు

(5వ పేజీ తరువాయి)

అనంతరం భారత ప్రజానాయవాదుల సంఘం నాయకులు సురేష్ కుమార్, వి.పెంటయ్య, పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక అధ్యక్షులు కవ్వాల లక్ష్మారెడ్డి, హుస్సేన్, రవీంద్రనాథ్, రవీందర్ రావు మాట్లాడారు. ఈ సందర్భంగా అమరుల ఆశయాలను సాధిస్తామని నినదించారు. కవులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు, చిన్ననాటి మిత్రులు, నాటి తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కళాకారుల ఆట పాటలు ఆకట్టుకున్నాయి. జోహార్లు నినాదాలతో సభా ప్రాంగణమంతా మారుమోగింది. కార్యక్రమంలో బస్వరాజు శంకర్, కుటుంబ సభ్యులు, సానుభూతిపరులు, బంధుమిత్రుల సంఘం ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు..


మాట్లాడుతున్న ఖాతా రామచంద్రారెడ్డి భార్య మాలతి

గుంతల్లో పూలు వేసి నిరసన


ప్రజ్ఞాపూర్‌లోని జగదేవ్‌పూర్ రోడ్డులో గుంతలో పూలు చల్లుతూ నిరసన తెలుపుతున్న యువకుడు

గజ్వేల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జగదేవ్‌పూర్ రోడ్డు దుస్థితిపై ఓ యువకుడు ఆదివారం వినూత్నరీతిలో నిరసన తెలిపాడు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన గొడుగు రాజు అనే వ్యక్తి జగదేవ్‌పూర్ రోడ్డులో ఏర్పడిన గుంతల్లో పూలు చల్లి నిరసన తెలిపారు. కొన్నాళ్ల క్రితం కురిసిన వర్షాలతో ఏర్పడిన గుంత పెద్దదిగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఇదే రోడ్డులో పాఠశాల ఉందని, విద్యార్థులను తీసుకుని తల్లిదండ్రులు వచ్చివెళ్లడంతో పాటు అనేక గ్రామాల ప్రజలు, వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలబారిన పడుతున్నారని, వెంటనే గుంతను పూడ్చాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం


ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు

గజ్వేల్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేరిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మోతేకాని కుమార్, ఉపాధ్యక్షుడిగా కర్రె కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్న చంద్రం, కోశాధికారిగా బోయిని స్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోతేకాని కుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన శక్తిమేరకు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు

గజ్వేల్ రూరల్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కోమటిబండ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సుంచు మన్విక్ అనే విద్యార్థి విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉబ్బాని ఆంజనేయులు, ప్రవీణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేటలో 'విజిట్ అవర్ మసీద్'

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జమాతే అహలే హదీస్, మెసెంజర్ పాత్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని మసీద్ ఏ తౌహిద్ లో ఆదివారం విజిట్ అవర్ మసీద్ కార్యక్రమం నిర్వహించారు. ముస్లిమేతరులను మసీదులోకి ఆహ్వానించి వారికి మసీదులో జరిగే ప్రతీ కార్యక్రమాన్ని వివరించారు. చాలా మందికి ముస్లిమేతరులను మసీదులోకి రానివ్వరనే అపోహ ఉండేదని, ఇలాంటి కార్యక్రమం వల్ల అపోహలు పటాపంచలయ్యాయని జమాతే అహలే హదీస్, మెసెంజర్ పాత్ వక్తలు పేర్కొన్నారు. తోటి మానవుల పట్ల ప్రేమాను రాగాలతో కలిసి ఉండడమే ఇస్లాం బోధిస్తుందని అన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత


పట్టుబడిన ఇసుక వాహనం

కోహెడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని ఆదివారం పట్టుకున్నట్టు ఎస్‌ఐ పి అభిలాష్ తెలిపారు. వింజపల్లి గ్రామం మోయతుమ్మెదవాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ద్యాగటి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి తన బొలెరో వాహనంలో ఇసుకను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామన్నారు.